రెండిళ్లలో చోరీ



నవతెలంగాణ-దుబ్బాక

రెండిళ్లలో చోరీ చేసిన దొంగలు నగలు, నగదు అపహరించిన ఘటన దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ వి.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన మర్కంటి అంజయ్య, విభూతి సాయి కృష్ణ తమ ఇళ్లకు తాళాలు వేసి పనులకు వెళ్లారు. రెండుఇండ్ల తాళాలు పగలగొట్టిన దొంగలు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. అంజయ్య ఇంట్లో తులం బంగారం, 35 తులాల వెండి వస్తువులు, రూ.7 నగదు, విభూది సాయికృష్ణ ఇంట్లో ఒక తులం బంగారం వస్తువులు, రూ.14 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గంగరాజు వెంటనే తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలను సేకరించామన్నారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

నవతెలంగాణ

1

మెదక్

ఆదివారం | 04 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

భారత రత్న ప్రకటించడం దేశానికి గర్వకారణం



నవతెలంగాణ -నంగునూరు

మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి భారత రత్న ప్రకటించడం దేశానికి గర్వకారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.విద్యాసాగర్ పేర్కొన్నారు. శనివారం కేంద్ర పార్టీ పిలుపు మేరకు నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు బెదురు కుమారస్వామి అధ్యక్షతన ఘావ్ చలో అభియాన్ కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన పథకాల గురించి పేదలకు వివరించి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. మెదక్ ఎంపీ స్థానంలో విజయం సాధించి మోదీకి కానుక ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసర యాదమల్లు, మల్యాల రాజు, గట్టు రవి, బండి సతీష్, గోవిందారం నారాయణ, మంత్రి కొమురయ్య, బెండల రాజలింగం, కృష్ణ, సంపత్, స్వామి, తిరుపతి, కిషోర్, అనిల్, ప్రశాంత్, ప్రతాప్ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మె

- గ్రామీణ బంద్
- బీజేపీ కార్పొరేట్.. మతతత్వ విధానాల పట్ల నిరసన
- మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై..
- చార్జ్‌షీట్ ప్రకటించిన ట్రేడ్ యూనియన్లు.. సంయుక్త కిషాన్ మోర్చా
- సమ్మె, బంద్‌కు సన్నాహాలు.. విస్తృత ప్రచారం
- నోటీసీలిచ్చి సమ్మెకు సిద్ధమవుతున్న ఆయా సంఘాలు
- సమ్మె పోరాటంలోకి సకల జనులు: మల్లేశం, సాయిలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు, మతతత్వ ధోరణుల్ని దిక్కరిస్తూ సకల జనులు ప్రతిఘటనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ నిర్వహించేందుకు జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిషాన్ మోర్చా పిలుపు నిచ్చాయి. దేశ వ్యాప్తంగా జరగబోయే సమ్మె, బంద్ పోరాటానికి ఉమ్మడి మెదక్ జిల్లా సన్నద్ధమవుతోంది. కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బంద్ పాటించి తమ నిరసన గళాన్ని వినిపించేందుకు అన్ని వర్గాల ప్రజలకు సమాయత్తమవుతున్నారు. పారిశ్రామిక వాడలు, పట్టణాలు, గ్రామాల్లో సమ్మె, బంద్ జయప్రదం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ ఇతర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయా సంఘాలు నోటీసులిచ్చి సమ్మెకు సిద్ధమవుతున్నారు.

బీజేపీ పదేళ్ల పాలనలో అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది. వివిధ రూపాల్లో వ్యక్తమవుతున్న నిరసన సెగలు అగ్నిజ్వాలలై మండనున్నాయి. దేశ వ్యాప్తంగా సమ్మె పోరాటం జరగబోతుంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన హామీని విస్మరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాక, ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంది. కార్మికుల నిజవేతనాలు పెరగట్లేదు. పైగా ధరలు విపరీతంగా పెంచుతున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని కార్మిక వర్గం కనీస వేతనాలకు నోచుకోవట్లేదు. పైగా పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిన ఫలితంగా పారిశ్రమల యాజమాన్యాలకు మేలు చేకూర్చింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలైన బీహెచ్ఈఎల్, ఓడీఎఫ్, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ వంటి సంస్థల్ని ప్రయివేట్ పరం చేయడం వల్ల ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో 60 శాతం వలస కార్మికులున్నారు. వీరందరితో రోజుకు 12 గంటలు పనిచేయిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఉపాధి దొరకని పరిస్థిలొచ్చాయి. జాతీయ ఉపాధి హామీకి కేంద్రం ఏటేటా నిధుల్ని తగ్గించింది. వంద రోజుల పని గ్యారంటీ లేకుండా పోయింది. చేసిన పనికి బిల్లులివ్వట్లేదు. 200 రోజుల పని, రూ.600 కూలీ చెల్లించాలని కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు కొట్లాడుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. నల్ల చట్టాల తెచ్చి వ్యవసాయానికి దెబ్బతీయాని బీజేపీ చూసింది. పోరాడిన ఫలితంగా చట్టాల అమలు ఆగింది. ఎరువుల సబ్సిడీలు తగ్గించడం వల్ల రైతులపై ధరల భారం పడుతుంది. పంటలకు కనీస మద్దతు ధరలు పెంచట్లేదు. ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం సేకరణ చేయకపోవడం వల్ల మూడు జిల్లాల్లో ఏటా పండుతున్న లక్షలాది మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. మూడు జిల్లాల్లో 8 లక్షల ఎకరాల్లో పత్తి పండుతుంటే ఏటా సీసీఐ పత్తి కొనుగోళ్లను పట్టించుకోవడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పించన్, వేతనాలు, 8వ వేతన సవరణ వంటి సమస్యలున్నాయి. వీటన్నిటిపై కార్మికులు, కర్షకులు, రైతులు, కూలీలు, ఉద్యోగులు, యువకులు పెద్ద ఎత్తున సమ్మె పోరాటాలని సిద్ధమవుతున్నారు.

విస్తృత ప్రచారం

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిషాన్ మోర్చా ఆధ్వర్యంలో 16న జరిగే సమ్మె, గ్రామీణ బంధను జయప్రదం చేయాలని విస్తృత ప్రచారం చేస్తున్నారు. వివిధ రంగాల వారిగా కరపత్రాలేసి పంపిణీ చేస్తున్నారు. కార్మిక రంగంలో మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ, అంగన్వాడీ, ఆశాలు, మధ్యాహ్నభోజన కార్మికులు, వీఓఎలు, మిషన్‌భగీరథ కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, వైద్య, విద్యా శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, పర్మినెంట్ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికుల సమస్యలపై వేర్వేరుగా కరపత్రాలు, పోస్టలు వేసి ప్రచారం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం, కూలీల సమస్యలపై కరపత్రాలు వేసి ఇంటింటికీ తిరిగి పంచుతూ కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ సమ్మెలో పాల్గొనాలని కోరుతున్నారు. సంగారెడ్డి, పటాన్‌చెరు, బొల్లారం, పాశమైలారం, జహీరాబాద్, అందోల్, హత్నూర, మెదక్, మనోహరబాద్, చిన్న శంకరంపేట, రేగోడు, చేగుంట, తూప్రాన్, గజ్వేల్, మర్కుక్ ములుగు, సిద్దపేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో ఆయా కంపెనీల యూనియన్ల ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు పెట్టి సమ్మె గురించి ప్రచారం చేస్తున్నారు.

సమ్మె నోటీసులు

సమ్మెలో పాల్గొననున్న కార్మిక సంఘాలు 16న జరిగే సమ్మె గురించి నోటీసులిస్తున్నారు. ఆయా కంపెనీల కార్మికులు యజమానులకు సమ్మె నోటీస్ ఇచ్చి 16న సమ్మె చేయబోతున్నట్లు చెబుతున్నారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సైతం సమ్మె నోటీసులు అందజేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 మున్సిపాలిటీల్లోనూ సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధమై కమిషనర్లకు సమ్మె నోటీసులిచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1615 గ్రామ పంచాయతీల్లోనూ సమ్మె చేయనున్నట్లు కార్మికులు పంచాయతీ కార్యదర్శులకు నోటీసులిచ్చారు. వైద్య, ఆరోగ్య, వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ సమ్మె చేసేందుకు కాంట్రాక్టు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు.

సకల జనులు సిద్ధం: సీఐటీయూ నేతలు

16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను సంగారెడ్డి జిల్లాల్లోనూ విజయవంతం చేసేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షకార్యదర్శులు మల్లేశం, సాయిలు, సిద్దిపేట జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎల్లయ్య, గోపాలస్వామి, మెదక్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మల్లేశం, బసవరాజ్ తెలిపారు. సకల జనులూ బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె పోరాటంలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, కూలీలతో కలిసి కార్మిక వర్గం కలిసి ఐక్యంగా ఒకే రోజు దేశ వ్యాప్తంగా పోరాడబోతున్నామని తెలిపారు.

దళితుల వద్ద బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నొక్కిన డబ్బులు కక్కాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధ్యత వహించాలి
- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

దళితబంధు ఇప్పిస్తామని దళితుల వద్ద బీఆర్ఎస్ జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తీసుకున్న డబ్బులను కక్కాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో శనివారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ముస్త్యాల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ దళితబంధు పథకంలో రూ.10 లక్షలు ఇప్పిస్తామని చేర్యాల, కొమరవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన అనుచరులైన బీఆర్ఎస్ జెడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, కౌన్సిలర్లను ఉపయోగించుకొని దాదాపు 144 మంది దళితులు ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేశారని, దాదాపు రూ.2.8 కోట్ల వరకు దండుకుని దళితబంధు పథకం మంజూరు చేయించలేదన్నారు. తీసుకున్న డబ్బులను ప్రతి దళితుడికి మిత్తితో సహా మాజీ ఎమ్మెల్యే చెల్లించాలని, దీనికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని చెప్పారు. చివరికి నిరుపేద దళితుల మీద ఏమాత్రం కనికరం చూపకుండా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఇంత ఘోరానికి పాల్పడ్డాడన్నారు. మోసపోయిన దళితులు ఎవరికి వారు రోడ్డెక్కి న్యాయం చేయాలని రోధిస్తున్నారని, దళితుల పట్ల వెంటనే పోలీస్ శాఖ, మానవ హక్కుల విభాగం, ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి పూర్తి సమాచారాన్ని సేకరించి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, అతని అనుచరులైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులపై చర్యలు తీసుకోవాలన్నారు. మాయమాటలు చెప్పి అమాయక దళితులను మోసం చేసి దండుకున్న డబ్బులను వడ్డీతో సహా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నుంచి కక్కించాలని డిమాండ్ చేశారు. దళితుల వద్ద తీసుకున్న డబ్బులను మిత్తితో సహా తిరిగి ఇప్పించే వరకు బాధిత దళితులకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఇంత ఘోరం జరుగుతుంటే ఏమీ తెలియనట్లు నటిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ వ్యవహారంపై పూర్తి బాధ్యత తీసుకొని దళితులకు డబ్బులు తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తమ పార్టీ బాధిత దళితులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తుందని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ చేర్యాల మండల కార్యదర్శి



కొంగరి వెంకట మావో, నాయకులు పోలోజు శ్రీహరి, జిల్లా కమిటి సభ్యులు బండకింది అరుణ్,దాసరి ప్రశాంత్,నాయకులు బోయిని మల్లేశం, దాసరిచక్రపాణి, దర్శనం రమేష్,రాళ్లబండి చందు, బాలస్వామి, గొర్రె శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దొంగతనాల జోరు

- తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు
- బంగారం, వెండి, నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న దొంగలు





నవతెలంగాణ-మిరుదొడ్డి

తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. బంగారం, వెండి, నగదుతో ఉడాయించి పోలీసులకు సవాల్ విసురుతున్నారు. వారం రోజుల వ్యవధిలో దుబ్బాక సర్కిల్ పరిధిలోని రెండు గ్రామాల్లో దొంగతనం జరిగింది. నిఘా నేత్రాలు లేకపోవడంతో గ్రామాల్లో దోపిడీ దొంగలు చెలరేగిపోతున్నారు. ఉపాధి కోసం వచ్చినట్లు నటిస్తూ విచ్చలవిడిగా తిరుగుతూ గ్రామాల్లో చిల్లర దొంగతనాలుకు పాల్పడుతున్నారు. రెండుమూడు నెలల నుంచి సంతలతో పాటు గుమ్మిగుడిన ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్తున్నారు. మండలంలోని అల్వాల గ్రామంలో ఒకేరోజు ఆరు ఇళ్లలో దోపిడీకి పాల్పడ్డారు. నాలుగు రోజులు గడవకముందే దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో అర్ధరాత్రి తాళం వేసిన ఇండ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని నగదు, వెండి, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఆ గ్రామానికి చెందిన మర్కంటి యాదమ్మ ఇంట్లో 50 తులాల వెండి వస్తువులతో పాటు మూడున్నర తులాల బంగారం, రూ.9 వేల నగదు, అదే గ్రామానికి చెందిన సాయి కృష్ణ ఇంట్లో తులం బంగారంతో పాటు రూ.14,500 ఎత్తుకెళ్లినట్టు బాధితులు వాపోతున్నారు. తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దొంగలను త్వరలో పట్టుకుని కోర్టుకు రిమాండ్ చేస్తామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న మహతి విద్యాకేతన్

- ప్రతి ఏటా పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు



నవతెలంగాణ- గజ్వేల్

విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ మెరుగైన ఫలితాలను సాధిస్తున్న మహతి విద్యా కేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ముందుకు దూసుకుపోతోంది. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతి ఏటా నూటికి నూరు శాతం ఉత్తీర్ణతకు యజమాన్యం కృషి చేస్తోంది. 1996లో గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మహతి విద్యా కేతన్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాభ్యాసం అందిస్తున్నారు. పేద విద్యార్థులకు ఫీజుల విషయంలో తగిన సాయం చేస్తూ పాఠశాల పేరు ప్రతిష్టలు నిలబెట్టుకుంటోంది. పాఠశాల చైర్మన్ షబానా ముంతాజ్, ప్రిన్సిపాల్ గోపి మాస్టర్ ప్రత్యేక శ్రద్ధతో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ తల్లిదండ్రులతో శభాష్ అనిపించుకుంటోంది. పాఠశాలకు విశాలమైన స్థలం ఉండడంతో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆటల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలపై పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ విద్యార్థుల పనితీరును పరిశీలిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 57 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వంద శాతం మార్కులు సాధించి పూర్తిస్థాయిలో ఉత్తీర్ణులను చేసేందుకు చైర్మన్ షబానా ముంతాజ్, ప్రిన్సిపాల్ గోపి మాస్టర్, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. తెలుగు పి.సబిత, హిందీ నఫీస్ ఫాతిమా, ఇంగ్లీష్ ఎంఎల్ కాంతారావు, గణితం, సాంఘిక శాస్త్రం వీజేరెడ్డి, ఫిజిక్స్ ఫరీన్, బయాలజీ సిరాజుద్దీన్ బోధిస్తున్నారు. ఉపాధ్యాయులు సకాలంలో వచ్చి మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు.

క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు



పాఠశాలలో విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. ప్రతి ఏటా పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు యాజమాన్యం కృషి చేస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరిస్తున్నారు. ఉపాధ్యాయులు సకాలంలో హాజరై బోధిస్తున్నారు. పాఠశాలలో స్మార్ట్ ఫోన్లు విద్యార్థులకు దూరంగా ఉంచుతున్నాం. ఈసారీ వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం.

– గోపి శర్మ, ప్రిన్సిపాల్

మద్యం సేవించి ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్న చైర్మన్

- పవిత్రమైన పదవిలో ఉండి మద్యం సేవించడం సిగ్గుచేటు
- చైర్మన్ మద్యం సేవించే స్థలంలో గొడవ
- పోలీస్‌స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో చైర్మన్ విఫలం



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం సేవించడం ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా ఉందని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ మల్లన్న సన్నిధిలో సేవ చేసే పవిత్రమైన పదవిలో ఉన్న చైర్మన్ ఆలయ పరిసర ప్రాంతంలో మద్యం సేవించి ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. కనీస సౌకర్యాలు లేక గత రెండు వారాలుగా జాతరకు వచ్చిన భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సౌకర్యాలు మెరుగుపరిచే చర్యలపై శ్రద్ధ చూపెట్టకుండా శుక్రవారం రాత్రి తన అనుచరులతో మద్యం సేవించిన ప్రాంతంలో గొడవ జరిగిందని, పోలీస్‌స్టేషన్లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని గుర్తు చేశారు. ఆలయ చరిత్రలో ఏనాడు ఇలాంటి సంఘటనలు జరగలేదని చెప్పారు. పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పదవిలో ఉండి ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడి ఆలయ పవిత్రతకు భంగం కలిగేలా ప్రవర్తించిన చైర్మన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలను, మల్లన్న భక్తులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి, మండల నాయకులు తాడూరి మల్లేశం, బక్కేల్లి బాలకిషన్, పుల్లంపల్లి సాయిలు, నీల బిక్షపతి, ఆరుట్ల రవి, చింతల శ్రీనివాస్, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి

- ప్రావిడెంట్ ఫండ్‌ను షేర్ మార్కెట్లో పెట్టే చర్యను ఉపసంహరించుకోవాలి
- 16న దేశవ్యాప్త సెక్టోరియల్ సమ్మెను జయప్రదం చేయండి
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ -గజ్వేల్

'స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలి. ప్రావిడెంట్ ఫండ్‌ను షేర్ మార్కెట్లో పెట్టే చర్యను ఉపసంహరించుకోవాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్తంగా సమ్మె, గ్రామీణ బంధును విజయవంతం చేయాలి' అని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. శనివారం ట్రేడ్ యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ నియోజకవర్గం ఏఐటీయూసీ కార్యదర్శి శివలింగకృష్ణతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకులు ధరలు పెంచి సామాన్యులపై భారం వేసిందన్నారు. ఉద్యోగులు, కార్మికుల జీతాల నుంచి కట్ చేస్తున్న పీఎఫ్ డబ్బులు షేర్ మార్కెట్లో పెడుతూ భవిష్యనిధికి భద్రత లేకుండా చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన అవసరాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. కనీస పెన్షన్ గ్యారెంటీ లేని దుస్థితి నెలకొందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్లను రూపొందించి కార్మికులకు రక్షణ లేకుండా చేసిందన్నారు. పరిశ్రమ నిర్వచనం మార్చి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా యాజమాన్యాలకు అనుకూలంగా మార్చిందని చెప్పారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పించకపోగా ఈ కాలంలో లక్షలాది చిన్న పరిశ్రమలను మూసి వేసిందన్నారు. దీంతో కోట్ల మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని చెప్పి నేటికీ వాటి ఊసే లేదన్నారు. కార్యక్రమంలో సీ ఐ టీ యూ నాయకులు రాజు ఏఐటీయూసీ నాయకులు పోచయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరం

నవతెలంగాణ -నంగునూరు

ప్రతిపక్ష పార్టీలు అనవసరంగా ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు ఎం.డి.ఇమ్రాన్ పేర్కొన్నారు. శనివారం నంగునూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీలను అమలు చేయడం గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. మరో రెండు గ్యారంటీలు అమలుకు క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బడుగు సదానందం, బడే అశోక్, చరణ్, బానుప్రసాద్, కె.సత్తిరెడ్డి, వి.రాజిరెడ్డి, పి.కనకయ్య గౌడ్, శివకుమార్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీఏలోకి మార్చాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

ముదిరాజులకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని, బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మల బాలరాజు అన్నారు. మిడిదొడ్డిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ముదిరాజులను ఓటుబ్యాంక్‌గా చూస్తున్న రాజకీయ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు నాలుగు ఎంపీ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండలం అధ్యక్షులు తుమ్మల విద్యాసాగర్ ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు కరాటి శివకుమార్, మాజీ ఎంపిటిసి గొట్టం బైరయ్య, నాయకులు బోయి నాగభూషణం, ఉషికే కనకరాజు, నరేశ్, రామచంద్రం, నాగరాజు, రాజశేఖర్, తుమ్మల చంద్రం పాల్గొన్నారు.

నవతెలంగాణ
నవతరం తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
ఆదివారం | 04 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ఘనంగా చింతా సాయినాథ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సదాశివపేట

బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ జన్మదిన వేడుకలను క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, అభిమానుల మధ్యన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సాయినాథ్ మాట్లాడుతూ.. తన శాయ శక్తుల ప్రజాసేవకే కృషి చేస్తానన్నారు. నియోజకవర్గం ప్రజలందరి ఆశీస్సులు తనపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ నస్రిన్ నసీరుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు డప్పు నర్సింలు బీఆర్ఎస్ నాయకులు కరీం, రహమత్, ఖదీర్, రమేష్, ఇనాయత్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి పాఠశాలలో 'బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్'



నవతెలంగాణ-సదాశివపేట

శ్రీ సత్యసాయి ఉన్నత పాఠశాలలో 'బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్' అనే అంశాన్ని తీసుకుని విద్యార్థులు అనేక రకాలైన వస్తువులను తయారుచేసి శనివారం ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి అంజయ్య హాజరై.. ప్రతీ విద్యార్థి తయారు చేసిన వస్తువులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భవిష్యత్‌లోనూ ఇలాంటి వాటిని మరిన్ని తయారు చేయాలని.. సమాజానికి ఉపయోగపడేలా రూపొందిం చేలా విద్యా ర్థులను తీర్చిదిద్దాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు ప్రదర్శించిన బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ అనే అంశాన్ని దృష్టిలో పెట్టు కొని విద్యార్థిని విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే వివిధ రకాలుగా తయారుచేసి చూపించడం జరిగిందన్నారు. తమ పాఠశాలలో ఇలాంటివి ఇంకా మంచి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

రైల్వే స్టేషన్లో పనులు పరిశీలించిన బోర్డు సభ్యులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో అమృత్ పథకం కింద చేప డుతున్న అభివృద్ధి పనులను రైల్వే బోర్డు మెంబర్ షేక్ ఫరీద్ శనివారం పరిశీలించారు. స్థానిక స్టేషన్ మేనేజర్ కృష్ణతో కలిసి పనులను పరిశీలించి.. పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతాలోపాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు బీఆర్ఎస్ విస్తృత సమావేశం

నవతెలంగాణ-జిన్నారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన పటాన్చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని నేడు(ఆదివారం) నిర్వహించనున్నట్టు పార్టీ మండలాధ్యక్షులు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు హాజరవుతున్నారు. కాబట్టి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు.

అసంగటిత రంగ కార్మికులకు సమగ్ర శాసనం తేవాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర శాసనం తేవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని అన్నారం గ్రామ భవన నిర్మాణ కార్మికులు శనివారం ఆయన సమక్షంలో సీఐటియులో చేరారు. ఈ సందర్భంగా రాజయ్య జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాడుతున్నదన్నారు. భవనిర్మాణ కార్మికుల కిచ్చే పారితోషికాలను పెంచాలన్నారు. ఆ స్కీంలో ఉన్న వాటన్నిటిని సమీక్షించి, ప్రస్తుత ధరలకు అనుకూలంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంగటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ,పీఎఫ్, పెన్షన్, ప్రమాద బీమా, రేషన్‌కార్డుల్లు, ఇళ్ల స్థలాలంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. భవనిర్మాణ కార్మికులు అత్యంత పేదరికంలో జీవిస్తున్నారని, ఉపాధి కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. నెలకు పది రోజులు కూడా ఉపాధి దొరకట్లేదన్నారు. ఇలాంటి సమస్యల కోసమే ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందని, సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మ్యాక్షన్, ఆన్నారో, మోల్టెక్ తదితర పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు నాగేశ్వరరావు, కె ప్రభు, రామకృష్ణ, బిక్షపతి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక విజ్ఞాన కేంద్రం కృషి అభినందనీయం



నవతెలంగాణ-జహీరాబాద్

సమాజంలో మార్పు తీసుకు వచ్చేందుకు శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న కృషి ఎంతో అభినందనీయమని ఏసీపీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. శ్రామిక్ విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న ఏడో, ఎనిమిదో బ్యాచ్‌ల ఉత్తీర్ణులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుమూల మహిళలకు, విద్యార్థినులకు, యువకులకు మెరుగైన ఉపాధితో పాటు జీవనోపాధిని కల్పించాలన్న లక్ష్యంతో శ్రామిక్ విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుంది సాధారణ అంశం కాదన్నారు. వారి ఉత్తీర్ణతతో పాటు వారిలో నూతన ఉత్తేజాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపారన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో యువతను ముందుండి నడిపిస్తున్న వారికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఉత్తీర్ణులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. శ్రామిక్ విజ్ఞాన కేంద్రం లక్ష్యాలను, కార్యక్ర మాలను మేనేజింగ్ ట్రస్టి బి.రాంచందర్ సభికులకు వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డిని శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రామిక్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ కె. శివబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్య క్రమంలో మేనేజింగ్ ట్రస్టీ రాంచందర్, ట్రస్టీలు జయరాజ్, మహిపాల్ ఇతర సభ్యులు వెంకటేశం, శ్రీనివాస్, శ్వేత, నర్సింలు, చంద్రశేఖర్ రెడ్డి, వలి టీచర్, అశోక్, ప్రతాప్ కుమార్, టైలరింగ్ సెంటర్ బాధ్యులు లలిత, మీనా పాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-పటపల్లి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేవీపీఎస్ మండలాధ్యక్షులు జనార్ధన్‌తో కలిసి ఎస్ఐ కోటేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సమాజంలో కుల వివక్షతను కుల నిర్మూల కు కెవిపిఎస్ పోరాటము హర్షించదగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు దాసయ్య, శివయ్య, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.



కంది : ప్రముఖ వైద్యులు, శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ ఆధ్వర్యంలో కేవీపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో వివక్ష కొనసాగుతోందన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతంలో పరిమితమైన వివక్ష ఉండేదని.. నేడు కార్పొరేట్ సంస్థల్లో సైతం సామాజిక తరగతుల పైన అనేక రూపాల్లో వివక్ష కొనసాగుతుం దన్నారు. మహనీయులు అంబేద్కర్, పూలే చూపిన బాటలో నేటి యువతరం ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడివయ్య ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడే ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో ఉజ్వల్ ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేటి(ఆదివారం) ఉదయం సమయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నెంబర్ 5 ప్రభుత్వ పాఠ శాల శాంతినగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ హాస్పిటల్, గ్లోబల్ ఐ హాస్పిటల్ హైదరాబాద్ వైద్యులు పాల్గొని వైద్యం అందిస్తారన్నారు. జనరల్ వైద్యులు, కార్డియాలజీ, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్ మరియు నేత్ర, కంటికి సంబంధించి కళ్లజోడుకు సంబంధించిన నిపుణులు పాల్గొంటారన్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా అవసరమైన మందులను, ఇతర సలహాలను, సూచనాలను అందిస్తారన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ ఉచిత మెగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్రషర్‌లో బ్లాస్టింగ్.. వ్యక్తికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-కంది

మండలంలోని ఎర్దనూర్ గ్రామ శివారు లో ఉన్న క్రషర్‌లో శనివారం మధ్యాహ్నం రాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో అక్కడే ఉన్న ఎర్దనూర్ తాండాకు చెందిన రైతు రమావత్ భీముడు చేయికి పెద్దరాయి వచ్చి తగిలింది. దాంతో అతడికి తీవ్ర గాయాలవడంతో.. వెంటనే ఆస్పత్రికి తరలించారు. ముందస్తు సూచనలు లేకుండా క్రషర్ నిర్వాహకులు బ్లాస్టింగ్ చేయడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు మండిపడ్డారు. వెంటనే సదరు క్రషర్ నిర్వాహకులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా తమ కాళ్ల పై తాము నిలబడాలి

- చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి
- హైకోర్టు న్యాయమూర్తి మట్టూరి గిరిజ ప్రియదర్శిని



నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళలు ఆర్థికంగా తమ కాళ్ల పై తాము నిలబడాలని హైకోర్టు న్యాయమూర్తి మట్టూరి గిరిజ ప్రియదర్శిని అన్నారు. ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ యాజమాన్యం సహకారంతో శనివారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి, సంగారెడ్డి యూనిట్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి మాటూరి గిరిజ ప్రియదర్శిని మాట్లాడుతూ.. కడుపులో ఉన్నప్పటినుండి చనిపోయే వరకు మహిళలకు అనేక హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. మహిళల కోసం పోరాడిన వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. పుట్ట బోయే బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే పురిటిలోనే చంపేస్తున్నారని.. ఇవి ఎక్కువగా ఉత్తర భారత దేశంలో జరుగుతున్నదన్నారు. భ్రూణ హత్యల నివారణ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. బాల్య వివాహాల నివారణ చట్టం వరకట్న నిషేధ చట్టం లైంగిక వేధింపుల వ్యతిరేక చట్టం, గృహహింస చట్టం, పురుషులతో సమానంగా ఆస్తిలో సమాన వాటా చట్టం, విడాకుల చట్టం, మనోవర్తి చట్టం, పోక్సో చట్టాల గురించి వివరించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఈ చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కలిగించాలన్నారు. చిన్న చిన్న సమస్యలకు ఆత్మహత్యలే పరిష్కారం కావు అని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని మనోత్సర్యంతో సమస్యలను ఎదుర్కోవాలన్నారు. పోక్సో చట్టం పైన పురుషులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలన్నారు. జిల్లా జడ్జ్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. మనిషి పుట్టుక నుండి చనిపోయిన తర్వాత కూడా హక్కులుంటాయన్నారు. వైద్యులు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరస్తునికి శిక్షను విధించే క్రమంలో వైద్యులు ఇచ్చే రిపోర్టు ఆధారంగానే శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. కేవలం న్యాయస్థానాల్లో మాత్రమే న్యాయ దేవత అని పిలుస్తూ మహిళలకు అంతటి గొప్ప స్థానాన్ని న్యాయ స్థానం కల్పించిందన్నారు. ఆకాశంలో సగం, అన్ని రంగాల్లో సగం కంటే ఎక్కువగా మహిళలు ఎదుగుతున్నారు. వారిని ఇంకా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. పేద ప్రజలకు ఉచిత న్యాయం అందించడానికి, ఆడవాళ్లకు విద్యార్థులకు కావలసిన న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఎవరికైనా న్యాయ సహాయం ఉచితంగా కావాల్సిన వారు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యాల యాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు సుదర్శన్, సునీత రవీందర్ రెడ్డి, రాధాకృష్ణ సోహన్, హనుమంతరావు, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు కలెక్టర్ మాధురి, ఎంఎన్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవివర్మ, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి. మహేష్, కాలేజ్ విద్యార్థులు, కళాశాల అధ్యాపకు బృందం పాల్గొన్నారు.



ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పరేడ్

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా ఎస్పీ ఆదేశానుసారం ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ నరేందర్ ఆధ్వర్యంలో ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు, ట్రాఫిక్ సిబ్బందికి, హెూంగార్డ్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్‌తో సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు, రోజువారీ విధుల్లో భాగంగా మెళకువలు నేర్చుకోవడం, డ్రిల్స్ ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరం అని.. సిబ్బంది, అధికారులు రోజు వ్యాయామం చేయాలన్నారు. శారీరకంగా శక్తి సామర్థ్యాలతో ఉన్నప్పుడే తమ విధులు సక్రమంగా నిర్వహించగలమని, ప్రతి ఒక్కరికీ ఫిజికల్ ఫిట్నెస్ తప్పనిసరి అన్నారు. సిబ్బందికి ఏవైనా సమ స్యలు ఉన్నట్లయితే ఈ పరేడ్‌లో అధికారులకు విన్నవించు కోవడానికి వీలుంటుందని, పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంభించాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి, జిల్లాకు, తెలంగాణ పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు.



ఎంపీ నిధులతో హైమాక్స్ లైట్లు ఏర్పాటు

నవతెలంగాణ-పుల్కల్

మండల పరిధిలోని లాల్‌సింగ్ నాయక్‌తాండాలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ తన సొంత ఖర్చులతో రెండు చోట్ల ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయించడం సంతోషకరమని తాండావాసులు హర్షం వ్యక్తం చేశారు. గత 50 ఏండ్లలో జరగని పనిని కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక పదేండ్లలోనే జరిగిందన్నారు. గిరిజనుల కోసం ఏ నాయకుడు ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని.. కానీ ఎంపీ బీబీ పాటిల్ సహకారంతో తమ తాండాలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. తమ తాండాకు అన్ని విధాల అండగా నిలుస్తున్న పార్లమెంట్ బి.బిపాలిటినే మరోమారు ఎన్నికల్లో గెలిపించుకుంటామన్నారు.కార్యక్రమంలో ఈశ్వర్, రానా రాథోడ్, పవన్, రవి,దినేష్ నాయక్, ఓంసింగ్ నాయక్ పాల్గొన్నారు.

రెసోనెన్స్‌లో ఘనంగా 'రెసో దర్పణ్' వేడుకలు

- ముఖ్య అతిథిగా రచయిత యండమూరి వీరేంద్రనాథ్



నవతెలంగాణ-పటాన్‌చెరు

రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ వార్షిక వేడుకలను శనివారం పటాన్‌చెరులోని రెసోనెన్స్ గురుకుల క్యాంపస్‌లో 'రెసో దర్పణ్' థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అకడమిక్, హెూలిస్టిక్ ఎడ్యుకేషన్‌లో రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఐఐటీ-జేఈఈ, నీట్, జేఈఈ (మెయిన్స్‌ంఅడ్వాన్స్‌డ్), ఇంజినీరింగ్/మెడికల్/కామర్స్/లా ప్రవేశ పరీక్షల శిక్షణలో అగ్రగామిగా ఉందన్నారు. సంస్కృతి, క్రీడలు, వివిధ పాఠ్యేతర కార్యకలా పాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామ న్నారు. గైడెన్స్ అనేది తరగతి గదికి మించి అందించాలన్నదే లక్ష్యమన్నారు. రెసోనెన్స్ లో అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేరణ, సంరక్షణ అనేవి కేవలం పదాలు మాత్రమే కాదని, అవి మా విధానంలో అంతర్భాగాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిగతంగా కూడా ఎదగడానికి ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. అకాడమిక్, క్రీడలు, ఇతర కార్యకలాపాలు, ఆదర్శప్రాయమైన ప్రదర్శనల వరకు ప్రతి విజయం తమ విద్యార్థుల కృషి, అంకితభావానికి నిదర్శనమన్నారు. అకాడమిక్ జీవితంలోని కష్టాల్లో కూడా పాఠశాల గుర్తుండిపోయేలా చేసే ఆహ్లాదకరమైన క్షణాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యా సకుల కుటుంబాలతో సహా 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెసోనెన్స్ హైదరాబాద్ గురించి గత ఇరవై సంవత్సరాలుగా ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్‌లకు దేశంలో ప్రసిద్ధి చెందిన ఇనిస్టిట్యూట్ రెసోనెన్స్. ఇటీవల సంవత్సరాలలో హైదరాబాద్‌లోకి ప్రవేశించింద న్నారు. భారతదేశంలో వేలాది మంది ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చింది. రెసోనెన్స్ కోటా తన 20 ఏళ్ల విజయ పరంపరను హైదరాబాద్‌కు తీసుకువచ్చిందని తెలిపారు. గత 20 ఏళ్లలో 46,000 పైగా రెసోనెన్స్ విద్యార్థులు ఐఐటీ, 2,50,000 పైగా రెసోనెన్స్ విద్యార్థులు ఎన్ఐటీలకు అర్హత సాధించారు. గత పదేళ్లలో 17000 పైగా రెసోనెన్స్ విద్యార్థులు మెడికల్ సీట్లకు అర్హత సాధించారు. కోవిడ్ పరిస్థితులు ఉన్నప్పటికీ గత మూడు విద్యా సంవత్సరాల్లో రెసోనెన్స్ హైదరాబాద్ వరుసగా జేఈఈ మెయిన్‌లో 75 శాతం విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఎస్.వెంకటేశ్వర్లు, ఎంఈఓ పి. పి రాథోడ్, భానూర్ సీఐ రవీందర్ రెడ్డి, అభిజ్ఞ, మిస్ పర్ఫెక్ట్ మూవీ టీమ్ సభ్యులు హాజరయ్యారు.

ప్రతీ పల్లెను ప్రగతికి తార్కానంగా తీర్చిదిద్దాం





నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజాస్వామ్యంలో పదవులు అత్యంత బాధ్యతతో కూడుకున్నవని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తే ప్రజల ఆశీర్వాదం పొందవచ్చని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తాజా మాజీ సర్పంచులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులను శాలువా, మేమెంటో తో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో ఐదేండ్ల పాటు గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు దేవానందం, సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, ప్రవీణ విజయ భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజా వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిన్నారం : మండల పరిధిలోని గ్రామ పంచాయతీల వారీగా సర్పంచులను, ఉపసర్పంచులను, ప్రజా ప్రతినిధులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐదేళ్లపాటు అభివృద్ధిలో భాగమైన ప్రజా ప్రతినిధులు అందరినీ అభినందించారు. శాలువాలతో సత్కరించి మేమంటోలు జ్ఞాపికలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు రాజేష్, సీనియర్ సర్పంచులు ప్రకాశంచారి, శెట్టి శివరాజ్, జనార్ధన్, ఖదీర్ ఆంజనేయులు, సుశాంతి నవనీత రెడ్డి, ప్రశాంతి, సరిత సురేందర్ గౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న మోడీ సర్కార్





నవతెలంగాణ-సదాశివపేట

కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం ఆరోపించారు. మతతత్వ ఎజెండాను దేశంలో అమలు జరుపుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నదని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని నందికంది గ్రామంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి.. నేడు ఉన్న ఉద్యోగాలనే తీసేస్తున్నారన్నారు. నిరుద్యోగం గత 50ఏండ్ల గరిష్ట స్థాయికి చేరిందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను పెట్టుబడుదాలకు అనుకూలంగా తయారు చేసిందన్నారు. 8 గంటల పని స్థానంలో పన్నెండు గంటల పని విధానం తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్రజల మధ్య వైశ్యమ్యాలను రెచ్చగొట్టడానికి మతతత్వ ఎజెండాను అమలు చేస్తుందన్నారు. ఈ పదేండ్ల కాలంలో బడా కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మిక రైతు కర్షక ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్ సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్, ఎన్ మల్లేశం, రవి జనార్ధన్, సంజీవులు, వీరేశం, పాండు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : మండల పరిధిలోని పారిశ్రామిక వాడలో గల అరబిందో, మైలాన్, శక్తి హార్మోన్‌తో పాటు పలు పరిశ్రమల యాజమాన్యానికి ఫిబ్రవరి 16న తలపెట్టిన సమ్మె నోటీసును సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలను అవలంభిస్తున్నదన్నారు.కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసున్నదన్నారు. అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా మత రాజకీయాలకు పాల్పడుతోందని ఎద్దేవా చేశారు. ధరలు పెరుగుదల, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, రైతాంగం సమస్యలు ఆత్మహత్యల ఓవైపు దేశంలో విలయతాండవం చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. మోడీ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటు న్నాయని.. ఈ సమ్మెకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, మండల నాయకులు ప్రభు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్ : ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరు కార్మికులపై ఉన్నదని వీవోఏల మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. అలాంటి ప్రజా వ్యతిరేక విధనాలను నిరసిస్తూ జరగనునన దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

- వ్యసనాన్ని మానుకోవాలి లేదా వేరే చోటుకు తరలివెళ్లాలి
- జహీరాబాద్ సీఐ రవి..



నవతెలంగాణ-జహీరాబాద్

గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయించే వారు, ఆస్వాదించే వారు తక్షణమే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని.. లేదా తమ వ్యసనాలను మానుకోవాలని జహీరాబాద్ సీఐ ఆర్ రవి హెచ్చరించారు. లేని యెడల వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తమ సిబ్బంది ఎవరు కూడా సివిల్ తగాదాల్లో తల దూర్చరన్నారు. ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే.. నేరుగా తనను సంప్రదించాలన్నారు. నేరస్తులతో కఠినంగా ఉంటూ మిగతా ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిస్తం అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపంలో ఉన్నందున బాధ్యత తీసుకున్న రెండు రోజుల్లోనే కోహీర్ జహీరాబాద్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి సమస్య ఆత్మక ప్రాంతాలను గుర్తించినట్టు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిని ఉపేక్షించబోమన్నారు. ఆక్సిడెంట్ జరిగిన ప్రదేశంలో ఎట్టి పరిస్థితులల్లో గుమ్మిగూడొద్దని.. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్లపై అడ్డగోలుగా ఆటోలు నిల్పొద్దని.. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ డాకుమెంట్స్ వెంట పెట్టుకోవాలన్నారు. వారు ఒక నెల రోజులలోపు అన్ని సమకుర్చుకోవాలని.. అటు పిమ్మట వెహికిల్ వెంట డ్రైవింగ్ లైసెన్స్, వెహికిల్‌కు సంబంధిన డాకుమెంట్స్ లేకుంటే వెహికిల్ సీజ్ చేసి చట్టపరమైన తగు చర్యలు తీసుకంటామన్నారు. రోడ్లపై రాష్ డ్రైవింగ్ చేయొద్దని.. బుల్లెట్ వాహనాలకు హై సౌండ్ కల్గిన సైలెన్సరులు పెట్టొద్దన్నారు. ఎవరైనా వాటిని వినియోగిస్తే వెహికిల్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించొద్దన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా తిరిగితూ కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువతీ యువకులు చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. అది సరికాదన్నారు. ఇప్పటికే ప్రతీ గ్రామంలో బెల్ట్ షాపుల వారికి పలు సూచనలు చేశామని.. వారు ఇతర వ్యాపారాలకు మల్లకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మత్తు పదార్థాలను నివారించాల్సిన బాధ్యత అందరిది



నవతెలంగాణ-సదాశివపేట

నేటి యువకులను నిర్వీర్యం చేస్తున్న చెడు వ్యసనాలు, మాదకద్రవ్యాలను, మత్తుపదార్థాలను నివారించాల్సిన భాద్యత ప్రతీ ఒక్కరిపై ఉన్నదని పి.రాములు గౌడ్ అన్నారు. 'దేశాభివృద్ధిలో నేటి యువతరం పాత్ర' అనే అంశంపై సదాశివపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ, మరియు లియో క్లబ్‌లు సంయుక్తంగా ప్రిన్సిపాల్ పతంజలి సమక్షంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ యం.వెంకటేశం అధ్యక్షతన శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు కళాశాల లియో కోఆర్డినేటర్ లయన్ పి.రాములు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతో లయన్స్ క్లబ్ మరి యు లియోక్లబ్ ద్వారా మాదకద్రవ్యాలను నిరోధించుటకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజ్ఞప్తితో.. కళాశాలలో మౌలిక సదుపాయాలను లయన్స్ క్లబ్‌ను కోరగా..కళాశాలకు డెస్కులను మరియు చైర్‌లను సమకూరుస్తామని రాములుగౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమ ంలో కళాశాల ప్రొఫెసర్లు అనూరాధ, పద్మ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లతో పాటు లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మె లయన్ వెంకటరమణ, లయన్‌రాంగోపాల్, పిసికల్‌డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' కార్మికుల సమ్మె మరింత ఉధృతం



నవతెలంగాణ-న్యాల్‌కల్

గత 10 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాఘవపూర్‌లోని మిషన్ భగీరథ ఫిల్టర్‌లో పనిచేస్తున్న కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని.. కాబట్టి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన సమ్మెలో పలువురు కార్మికులు మాట్లాడుతూ.. 10 నెలలుగా జీతాలు రాక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమకు పీఎఫ్, ఈఎస్ గుర్తింపు కూడా లేదని వాపోయారు. సమస్యల పరిష్కారానికి గత నాలుగురోజులుగా సమ్మె చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను విరమించబోమని.. మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె చేస్తున్న వారిలో రాములు, గోపాల్ రెడ్డి, నరసింహులు, రాజు, కృష్ణ, రాకేష్, రమేష్, శీను, సురేష్, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
ఆదివారం | 04 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

గురుకుల పాఠశాల పరిసరాలను శుభ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది

మంత్రి ఆదేశాలతో కదిలిన మున్సిపల్ కమీషనర్



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది కదిలారు. గురుకుల పాఠశాల ఆవరణలో ఎలాంటి అపరిశుభ్రం లేకుండా సిబ్బందితో శుభ్రం చేయించారు. శుక్రవారం రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తూప్రాన్ మండలం అల్లాపూర్ శివారులోగల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా మంత్రి పాఠశాల ఆవరణ చూసి అపరిశుభ్రంగా ఉంచుతారా అంటూ వెంటనే శుభ్రం చేయించాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. దాంతో శనివారం ఉదయం మున్సిపల్ కమీషనర్ ఖాజామొయినొద్దిన్ సిబ్బందితో పాఠశాల ఆవరణ అంతా శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, వార్డు ఆఫీసర్లు బాబు, రంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొల్చారం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొల్చారం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు మహమ్మద్, ఆరిఫ్‌ల కుటుంబ సభ్యులను శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమా రాజాగౌడ్, ఉపసర్పంచ్ మాజీ చెన్నయ్య, సహకార సంఘం చైర్మన్ మనోహర్, మాజీ సిడిసి చైర్మన్ నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంతోష్, నాయకులు ప్రవీణ్, ప్రభాకర్, ఏడుపాయల ఆలయ కమిటీ సభ్యులు బాగా రెడ్డి, నాయకుడు సోమ నర్సింహులు, మాజీ సర్పంచ్ ఇందిరా ప్రియదర్శిని సందీప్, మోహినొద్దిన్, దుర్గాప్రసాద్ గౌడ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ

- 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం



నవతెలంగాణ-వెల్దుర్తి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరారు. అచ్చేదిన్, ఆయాగ, మేకిన్ ఇండియా, అంటూ మోసపూరిత నినాదాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఏమి చేయలేక పోయిందన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు, పేద కుటుంబానికి రూ.15 లక్షలు అకౌంట్లో జమ చేస్తాం, ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి పది సంవత్సరాలైనా నేటికీ అతిగతి లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు సహజ వనరులను కార్పోరేట్ల కోసం పని చేసిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల మీద దాడి చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. రైతాంగాన్ని ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం రైతులను మోసం చేసి నల్ల చట్టాలు తెచ్చారన్నారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరం పాటు పోరాటం చేసి మోడీ మెడలు వంచిన చరిత్ర రైతాంగానికి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న, దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రాంతం కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కూలీలు గ్రామీణ బంధు నిర్వహించి ఎక్కడికక్కడ నిర్బంధం చేసి మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షులు దుర్గపతి, హమాలి యూనియన్ మండల అధ్యక్షులు వెంకట్, నాయకులు రవి, సాయిలు, సత్తయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను సన్మానించిన యువజన సంఘం నాయకులు



నవతెలంగాణ-వెల్దుర్తి

నూతనంగా వచ్చిన ఎస్ఐ నవనీత గౌడ్‌ను శనివారం మండలానికి చెందిన భీమ్ వారియర్స్ యువజన సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని కానుకగా అందజేశారు. అనంతరం ఎస్సై నవనీత గౌడ్‌తో గ్రామాల్లో జరుగుతున్న మంచి చెడుల విషయాలపై చర్చించామన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ నవనీత గౌడ్ మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. చెడు మార్గం చాలా ప్రమాదకరమని నేటి యువత అలాంటి విషయాలను ప్రోత్సహిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. తాను కూడా పుట్టి పెరిగింది పల్లెటూరి మధ్యతరగతి గ్రామీణ ప్రాంత వాతావరణంలోనేనన్నారు. మంచి చెడు అనేది మన చుట్టూ ఉన్న ప్రాంతం నుంచి మొదలవుతుందన్నారు. యువత ప్రోత్సలం ఎంతో అవసరమని చెప్పారు. గ్రామాల్లో ఆవాంఛనీయ సంఘటనలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై, అలాగే మత్తు మాదక ద్రవ్యాలు సేవించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో ఏమైనా సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే తనకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీం వారియర్స్ సంఘం అధ్యక్షులు రవీందర్, సంఘ సభ్యులు పోతరాజు కుమార్, అశోక్, రమేష్, సుధాకర్, అర్జున్, నవీన్, నరేష్, మల్లేష్ గంగులు, ప్రభు, సంతోష్ పాంబండ శేఖర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గ్రామపంచాయతీ కార్మికుడి మృతి

అంత్యక్రియలకు రూ.10వేలు అందజేసిన ఎంపీడీవో



నవతెలంగాణ-మనోహరాబాద్

గత బుధవారం రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలైన గ్రామపంచాయతీ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మనోహరాబాద్‌లో జరిగింది. మనోహరాబాద్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పారిశుద్య కార్మికుడిగా గ్రామానికి చెందిన గుడ్లజి రమేష్ (30) పనులు చేస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి సమయంలో దండుపల్లి నుంచి మనోహరాబాద్‌కు సర్వీస్ రోడ్డులో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తలకు తీవ్ర గాయాలు కాగా సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 11.30 గంటలకు మృతి చెందాడు. శనివారం అంత్యక్రియలకై గ్రామపంచాయతీ నుంచి రూ. 10 వేలను ఎంపీడీవో యాదగిరిరెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో గ్రామ స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసి పొట్బోల్ల లత వెంకట్‌గౌడ్, సీఐటీయూ గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-సిద్దిపేట

ఇంటర్నేషనల్ క్యాన్సర్ డే సందర్బంగా మెడికల్ క్యాంప్ దేశాయ్ బీడీ కంపెనీలో బీడీ కార్మికులకు శనివారం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు చేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎస్. స్వాతి రెడ్డి తెలిపారు. మహిళలు బీడీలు తయారు చేసేటప్పుడు మాస్క్ ధరించాలని, చేతులకు గ్లౌజులు వేసుకోవాలని సూచించారు. బీడీలు చుట్టాలని, తడిపోగాకు బీడీలు తయారు చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. బీడీ కార్మికులు బీడీలు చేసేటప్పుడు పిల్లలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ గురించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. క్యాన్సర్ తొలిదశలోనే గుర్తించినట్లయితే ట్రీట్మెంట్ ద్వారా తగ్గే అవకాశం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వైద్యులు డా. విజేందర్ రెడ్డి, రవీందర్, దుర్గా, పటేల్ దీపక్, వెంకటేష్, ఎల్. మధుసూదన్ రెడ్డి, ఏ. శ్రీనివాస్ పాల్గొన్నారు.


పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని రాంపూర్ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి గీత ఆధ్వర్యంలో శనివారం వరి పంట పొలాలను పరిశీలించారు. వరిలో మొగిపురుగు (కాండం తొలిచే పురుగు) ఉధృతి ఎక్కువగా ఉందని గమనించారు. మొగి పురుగు ఉధృతి తగ్గించడానికి చేపట్టవలసిన నివారణ చర్యల గురించి మండల వ్యవసాయ అధికారిణి గీత రైతులకు తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ యాసంగిలో నారుమడి పిలక దశల్లో కాండం తొలిచే పురుగు రెక్కల పురుగుల ఉధృతి అధికంగా గమనించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పర్శరాములు, వ్యవసాయ విస్తరణ అధికారి వరుణ్ వర్మ, అశోక్, స్రవంతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వాసవి మా ఇల్లు జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-సంగారెడ్డి

వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ, సంగారెడ్డి జిల్లా సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా స్థాయి పదవ తరగతి విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా స్థాయి సోషల్ టెస్ట్ ద్వారా విద్యార్థులలో గల సాంఘిక శాస్త్రంపై పట్టు సాధించుటకు దోహదపడుతుందన్నారు. సహకరించిన మా ఇల్లు సంస్థ వారికి అభినందనలు తెలిపారు. మాఇల్లు వ్యవస్థాపక అధ్యక్షులు తొపాజి అనంత కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో సాంఘిక శాస్త్రంపై అవగాహన కొరకు ఈ టాలెంట్ టెస్ట్ గత ఆరు సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మాఇల్లు సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పూర్తి ఆర్థిక సహకారాన్ని జిల్లా జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షులు బండారు యాదగిరి అందించారన్నారు. మా ఇల్లు సంస్థ ద్వారా గత 14 సంవత్సరాలుగా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు ఇటీవల తారా కళాశాలలో లైఫ్ సైన్సెస్ పై రెండురోజుల జాతీయ స్థాయి నిర్వహణలో పూర్తి సహకారం అందించామని, కరోనా సమయంలో ఎందరికో భోజనాలు, బట్టలు, ఆర్థిక సహకారాలు అందించామన్నారు. జిల్లా సోషల్ ఫోరమ్ అధ్యక్షురాలు సునీతా ఖన్నా మాట్లాడుతూ ఈ టెస్ట్ లో ప్రభుత్వ ప్రైవేట్ విభాగాలకు చెందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు పురస్కారాలతో పాటు అందరికీ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడంలో మా ఇల్లు సచ్చంద సంస్థ ముందుంటుందని, ఈ సంస్థ సభ్యులందరికి అభినందనలు తెలిపారు. సోషల్ ఫోరమ్ కార్యదర్శి రామ్ రెడ్డి, జిల్లా సైన్స్ ఫోరమ్ అధ్యక్షులు సిద్దా రెడ్డి, మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ సభ్యులు మ్యాడం రాధాకిషన్, చీకోటి దయాకర్, కటుకం విజయ్, కొంపల్లి విద్యాసాగర్, ఇరుకుల్ల ప్రదీప్, నామా భాస్కర్, బీపేట వెంకటేశం, సుధాకర్ , రాచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలికల కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



నవ తెలంగాణ-మెదక్ టౌన్

ఇంటర్నేషనల్ క్యాన్సర్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ బాలికల కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి రిటా లాల్చంద్ మాట్లాడుతూ దగ్గు, శ్వాస ఇతర ఆరోగ్య సంబంధిత సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్లాలని సూచించారు. ధూమపానం, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, నడకతో పాటు రోజూ వ్యాయామం చేయాలని తెలిపారు. ముందస్తుగా క్యాన్సర్‌కు వాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. ఆడవారు డెలివరీ తరువాత వాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. తద్వారా క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చన్నారు. 35 సంవత్సరాల పై బడినవారు సంవత్సరానికి ఒకటి లేదా రెండుసార్లు మమ్మోగ్రఫీ చేయించుకోవాలన్నారు. తద్వారా క్యాన్సర్‌ను ముందుగానే పసిగట్టవచ్చన్నారు. 2024 థీమ్ అనేది ప్రతిఒక్కరికి ట్రీట్మెంట్ అందించబడుతుందని తెలిపారు. ఏవైనా సమస్యలు అనగా పని చేసే చోటులోగాని ఇతర కార్యాలయల్లోగాని అడ్వకేట్‌ని నియమించుకునే విషయంలోగాని ఏవైనా సమస్యలు ఉంటే మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్, ఫోక్సో యాక్ట్, వయసు వల్ల వచ్చే సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, తెలియని వారితో మాట్లాడడం వంటివి చేయకూడదని సూచించారు. గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి వివరించారు. సానిటరీ ప్యాడ్ ఉపయోగం, అసాధారణ పీరియడ్స్ ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల వసతి, భోజనం, వాష్ రూమ్స్ గురించి కళాశాల యజామాన్యాన్ని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ కాన్సర్‌ను ముందుగానే ఎలా గుర్తు పట్టాలో వివరించారు. నోట్లో అల్సర్స్ ఉంటే డాక్టర్‌ని సంప్రదించాలని సూచించారు. క్యాన్సర్‌లు స్టార్టింగ్ స్టేజిలో నొప్పి ఉండదు. కాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే తొందరగా నయం అయ్యే అవకాశం ఉందని వివరించారు. గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ కాన్సర్ మొదలైన వాటి గురించి వివరించారు. 35 సంవత్సరాలు పైబడినవారు సంవత్సరానికి ఒకటి లేదా రెండుసార్లు మమ్మోగ్రఫీ చేయించుకోవాలన్నారు. తద్వారా క్యాన్సర్‌ని ముందుగానే పసిగట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రజీమున్నిసా బేగం, సిద్దా గౌడ్, సిద్ధిరాములు, నరసింహ రెడ్డి, షీ టీం, సఖీ టీం, భరోసా సెంటర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

పెద్ద శంకరంపేట పట్టణం తిరుమలాపూర్ శివారులోని సర్వే నెంబర్ 1లో భూములు ఆక్రమించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తిరుమలపూర్ శివారులోని సర్వే నెంబర్ 1 లో ప్రభుత్వ భూములను ఆయన మెదక్ ఆర్‌డిఓ అంబదాస్ రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. తిరుమలాపూర్ శివారులో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని అధికారులకు తెలియడంతో గత నాలుగు రోజుల క్రితం ఆర్డిఓ డిపిఓలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. సర్వేనెంబర్1లో మూడు నాలుగు రోజుల్లో మరోసారి సర్వే చేసి బౌండరీలను గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఎవరైనా ఆక్రమించి వెంచర్లు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో వెలసిన వెంచర్లకు డిటిపిసి అప్రూవల్ ఉందా లేదా అని సంబంధిత తహసిల్దార్ కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేసీ బాయ్, ఆర్ఐ శరణప్ప తదితరులు ఉన్నారు.

పోటీ పరీక్షలకు సాంఘిక శాస్త్రం తప్పనిసరి

మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో వివిధ మండలాల్లో నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షలో సత్తా చాటిన 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ మాట్లాడుతూ అన్ని పోటీ పరీక్షలకు సాంఘిక శాస్త్రం తప్పనిసరన్నారు. ఈ సబ్జెక్ట్ ద్వారానే విద్యార్థులలో జాతీయ బావాలు, నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సోషల్ ఉపాధ్యాయులదన్నారు. తెలుగు మీడియం నుంచి 63 మంది, ఇంగ్లీష్ మీడియం నుంచి 70 మంది హాజరయ్యారని తెలిపారు. ప్రతిభాపాటవ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల తెలుగు మీడియం నుంచి ప్రథమ విష్ణు వర్ధిన్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనోహరబాద్), ద్వితీయ అనుష్క (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాయంపేట), తృతీయ సుధీష్ణ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నస్కల్)లు బహుమతులు అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లీష్ మీడియం నుంచి ప్రథమ సుమంత్ (ఎమ్ జె పి బాలుర హవెలి ఘనపూర్), ద్వితీయ వినయ (శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల), తృతీయ సృజన్ (ఎమ్ జె పి బాలుర హవెలి ఘనపూర్)లు బహుమతులు అందుకున్నారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం నుంచి ప్రథమ సాయి చరణ్ (శంకర స్కూల్, నిజాం పెట్), ద్వితీయ శ్రీ ప్రియా (గీతా చేగుంట), తృతీయ సోహన్ దీప్ సింగ్ (సత్యం విద్యా మందిర్)లు బహుమతులు పొందారు. విజేతలైన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధా కిషన్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన్ మూర్తి, రమేష్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మండల విద్యాధికారి నీలకంఠం, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మెదక్ జిల్లా సోషల్ ఫోరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరునగిరి నర్సింలు, ఎస్ ప్రభాకర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరమ్ సభ్యులు చల్లా లక్ష్మణ్, దత్తాద్రి కుల కర్ణి, సత్యనారాయణ, దేవి సింగ్, రవి బాబు, వీరేశం, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం



నవతెలంగాణ-నార్సింగి

గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో గువ్వలేగి భిక్షపతి తన పూరి గుడిసెలో చపాతీలు చేస్తున్న క్రమంలో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న నార్సింగి ఎస్సై అహ్మద్ మోహిఉద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు ఆరక పోవడంతో రామాయంపేట అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందివ్వగా, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గ్యాస్ సిలిండర్‌పై కార్బన్ డయాక్సైడ్ (సీఓ2) ను పిచికారి చేసి మంటలను ఆర్పి వేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌పై సీఓ2 స్ప్రే చేసి మంటలను ఆర్పి వేశామని, గ్యాస్ సిలిండర్‌ను బహిరంగ ప్రదేశంలో తీసుకువచ్చి గ్యాస్ మొత్తాన్ని తీసేయడం జరిగిందని వివరించారు. ఈ ఘటనలో సుమారు పది వేల నష్టం వాటిల్లిందని, మూడు లక్షల మేర ఆస్తిని కాపాడినట్టు తెలిపారు. నార్సింగి ఎస్సై అహ్మద్ మోహిఉద్దిన్, సిబ్బంది మంటలను అదుపు చేయడంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది రాకేష్, సత్యం, నరేందర్, నారా గౌడ్‌లకు సహకారం అందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటిన దామరకుంట విద్యార్థులు



నవతెలంగాణ-మర్కుక్

జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఐదు రోజులపాటు ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంట విద్యార్థిని బి సుష్మా , గైడ్ టీచర్ వై .చిన్న బ్రహ్మయ్య (భౌతిక శాస్త్రం), సిద్దిపేట స్ప్రింగ్ డేల్స్ గ్రామర్ హై స్కూల్ నుంచి రితేష్, గైడ్ టీచర్ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో అత్యుత్తమ ప్రదర్శన గావించారు. ఈ పోటీలో రెండు బహుమతులను తీసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులను, గైడ్ టీచర్లకు, వారిని ప్రోత్సహించిన జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

బాక్స్ కల్వర్టును పరిశీలించిన ఆర్ అండ్ బీ అధికారులు



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో చెరువు మత్తడిపై చేపట్టిన బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను శనివారం ఆర్ అండ్ బీ క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చత్రపతి, ఎస్ఈ వసంత్ నాయక్, ఈఈ బాల ప్రసాద్ బృందం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బాక్స్ కల్వర్టు పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టడం జరిగిందన్నారు. రూ.1.25 కోట్ల వ్యయంతో 22 మీటర్ల మేర నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టు పనులు 70 శాతం పూర్తయ్యాయని, ఆర్ అండ్ బీ డీఈఈ వెంకటేష్ తెలిపారు. ఇంకా కటాఫ్ వాల్, సేఫ్టీ, ప్రొటెక్షన్ పనులు కావలసి ఉన్నాయన్నారు. త్వరలోనే వాటిని పూర్తి చేయిస్తామన్నారు. గుత్తేదారులు అమ్మన మహిపాల్ రెడ్డి, నారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్‌లకు పలు సూచనలు చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన పెంబర్తి పెద్దరాజు (40) మర్కుక్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసేవారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. శనివారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మర్కుక్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, తాజా మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌తో కలిసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.18 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మొర్సు శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.

విద్యార్థులకు 12న సైన్స్ దినోత్సవ పోటీలు

నవ తెలంగాణ-సిద్దిపేట

జాతీయ సైన్స్ దినోత్సవాలలో భాగంగా పాఠశాల విద్యార్థులకు జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ పోటీలను నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్‌లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఈ నెల 12న పోటీలను నిర్వహిస్తామన్నారు. "సుస్థిర భవిష్యత్తు కోసం విజ్ఞాన శాస్త్రం" అనే ప్రధాన అంశంగా వ్యర్థాన్ని తగ్గించు, ఈ-వ్యర్థాన్ని తగ్గించు, ఆరోగ్యకరమైన జీవన విధానాలు అనుసరించు, సుస్థిర ఆహార వ్యవస్థలను అనుసరించు, ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పు, నీటిని సంరక్షించు, ఇంధనాన్ని సంరక్షించు అనే ఉపాంశాలపై పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చిత్రలేఖనం, కవిత్వం, పాటలు, ఉపన్యాసం విభాగాల్లో పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. మొదటగా ఈ పోటీలను జిల్లా స్థాయిలో నిర్వహిస్తారని, ప్రతి జిల్లా నుంచి ఆయా విభాగాల్లో ముగ్గురేసి చొప్పున విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 12 వరకు పూర్తి చేసి, అనంతరం రాష్ట్రస్థాయిలో టీఎస్ కాస్ట్, ఇపీటీఆర్ఐ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి విజేతలకు ఈ నెల 28న హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ 9849699382ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-తొగుట



మండలంలోని ఎల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఈఓగా జ్యోతిర్మయి, ఎంఈఓగా రిత్విక్, హెచ్‌ఎంగా రక్షిత, పవన్, ఉపాధ్యాయులుగా కార్తీక్, శ్రీనివాస్, ఫర్హానా, శ్రీవల్లి, మధులత, రేణుక, మనోజ్‌లు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్వయంపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయ వృత్తిపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంజుల, శ్రీలత, పిఆర్టియు మండల అధ్యక్షులు పి. రామచంద్రారెడ్డి, ఎస్టియు మండల అధ్యక్షులు జి. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సిద్దిపేట

ఆదివారం | 04 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

సెయింట్ జాన్స్ హైస్కూల్లో స్వయం పరిపాలన

నవ తెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని సెయింట్ జూన్స్ హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా అబ్దుల్ ఫర్ దిన్ సయీద్, యంఈవోగా వినయ్ వర్మ, కరస్పాండెంట్‌గా ముహమ్మద్ రాహి షోద్దన్, ప్రధానోపాధ్యాయులుగా సైమిన్ సిద్దిఖ వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేచల్ అనిత మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి భవిష్యత్తుకు పాఠశాల దశలతోనే పునాదులు వేసుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ సెల్వరాజు మాట్లాడుతూ ఈ దశలో మంచి క్రమశిక్షణతో ఉంటేనే భావి భారత పౌరులుగా తయారవుతారన్నారు. బాగా చదివి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయి బృందం పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ గ్రామానికి చెందిన పెంబర్తి పెద్దరాజు(40) మర్కుక్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసేవారు, ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. శనివారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి,జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మర్కుక్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశం , తాజా మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ తో కలిసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ,రూ.18 వేల ఆర్థిక సహాయం అందజేశారు.పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మొర్సు శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.

వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్ర బడ్జెట్

నవ తెలంగాణ-కొండాపూర్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేదిగా ఉందని తెలంగాణ రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె. రాజయ్య అన్నారు. మండలంలోని తెర్పోల్ గ్రామంలో చౌరస్తా వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతాలు దహనం చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు వెంకటేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సుదర్శన్, రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హనుమంతు, శేఖర్, అనంతయ్య, వినోద, ప్రేమలమ్మ, శ్యామ్ అమ్మ పాల్గొన్నారు.

వేతన జీవులకు నిరాశే

నవతెలంగాణ- నారాయణఖేడ్ రూరల్



కేంద్ర బడ్జెట్ పట్ల ఉద్యోగులు ఉపాధ్యాయులు ఏమాత్రం సంతోషంగా లేరని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ యాదవ్ అన్నారు. ఆదాయపు పన్ను రేట్లను సవరించకుండా రాయితీలను పెంచకుండా వేతన జీవులను కేంద్రం మోసం చేసిందన్నారు. ఉద్యోగుల పట్ల కనికరం చూడని చూపని నిర్మల సీతారామన్ కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

తెలంగాణకు అన్యాయం

నవతెలంగాణ నారాయణఖేడ్ రూరల్



పేదలకు తెలంగాణకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అన్యాయం చేసిందని మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో పేదలకు తెలంగాణకు నారాయణఖేడ్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందని అన్నారు. కార్పొరేట్లకు ఉపయోగపడే బడ్జెట్ అని అన్నారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు, కార్మికులకు అన్యాయం చేసే విధంగా ఉన్నాయని అన్నారు.

జాతరకు దాతల సహకారం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో జరిగేటువంటి సమ్మక్క సారళమ్మ జాతరకు రోడ్డు వేయడానికి వడ్ల కందారపు మహదేవ్ చారీ, జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సదానందాచారి సమ్మక్క సారలమ్మ జాతరకు రోడ్డు దాతగా నిలిచారు ఈ సందర్భంగా శనివారం రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం సదానంద చారి మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ జాతర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంచుకుందని అన్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని రోడ్డు వేయించామని తెలియజేశారు. కాబట్టి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట

నవ తెలంగాణ కొమురవెల్లి



మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పిట్టల రవీందర్‌లి ప్రకృతి పర్యావరణ సంస్థ సీఈవో మూగ జయశ్రీ తెలిపారు. మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఏర్పాటులో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

నవ తెలంగాణ దౌల్తాబాద్



సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన డ్రైవర్ గడ్డమీది తిరుపతి గౌడ్ (55) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి శనివారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామంలోని పొలంలో కేజీవీల్స్ ట్రాక్టర్‌తో దున్నుతుండగా, ప్రమాదవశాత్తు పొలంలో బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజిన్ కింద బురదలో ఇరుక్కున్న తిరుపతిగౌడ్ అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుని కుమారుని ఫిర్యాధు మేరకు ఏఎస్సై సాయిలు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పార్లమెంట్ ఎన్నికలలో కాషాయ జెండా ఎగరేయాలి



నవతెలంగాణ-తొగుట

పార్లమెంట్ ఎన్నికలలో కాషాయ జెండా ఎగరవే యడమే ధ్యేయంగా కార్యకర్తలకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరెడ్డి గారి విభీషణ్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గావ్ ఛలో బస్తీ ఛలో కార్యక్రమంలో భాగంగా బీజే పీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మన భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్వ హిస్తున్న ఎన్నో సంక్షేమ పథకాల గురించి వివరిం చారు. రాబోయే మెదక్ పార్లమెంట్ ఎన్నికలలో కాషాయ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా కార్య కర్తలు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. భారత దేశంలో ప్రజలు నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని కోరు కుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో మండల శాఖ అధ్యక్షులు చిక్కుడు చంద్రం, గావ్ ఛలో బస్తీ ఛలో మండల కన్వీనర్ ఐలిగొండ చంద్రశేఖర్ గౌడ్, కో కన్వీనర్ కళ్యాణ్ దాస్, వెంకట్రావుపేట ఎంపీటీసీ కంకణాల నర్సింలు, చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు, గుడికందుల ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు కడారి నరేంద్ర, మండల నాయ కులు నరసింహారెడ్డి, నంట స్వామి రెడ్డి, బెజగామ ఆంజనేయులు, బాల్ రెడ్డి, అంజి యాదవ్, గౌరిని నర్సింలు, కొమ్ము కరుణాకర్, కరుణాకర్, నరేష్ గౌడ్, శ్రావణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బాల నరసయ్య

నవ తెలంగాణ కొండపాక



కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల ఐక్యతకు విఘాతం కలిగిస్తూ ప్రజలపై అనేక ఆంక్షలు విధించి దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని, ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలి' అని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బాల నరసయ్య అన్నారు. శనివారం ఎంపీడీవో రామిరెడ్డి, ఎంఈఓ ఆఫీసులో ఎంఐఎస్ కోఆర్డినేటర్ సురేందర్‌లకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అమ్ముల బాల నరసయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక విధానాలను చేపడుతూ ప్రజలపై భారాలు మోపుతుందన్నారు సాగు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చే రైతుల భవిష్యత్తును నాశనం చేసే విధానాలు చేపట్టిందన్నారు పోరాడి సాధించుకున్న కార్మిక కర్షక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దుచేసి పెట్టుబడిదారు రా కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చే కార్మిక హక్కులను హరించి వేసింది అన్నారు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రజలపై మోయలేని బోరాలు పడుతున్నాయి అన్నారు దేశంలో రోజురోజుకు ఆకలి దరిద్రం నిరుద్యోగం పేదరికం పెరిగిపోతుంది అన్నారు కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు దేశ సంపదలను దోచిపెడుతున్నారని ప్రభుత్వ రంగ సంస్థలను దివాలా తీసివేసి తీయించి ప్రైవేటీకరణ విధానాలను యదేచ్ఛగా అమలు చేస్తున్నారని మండిపడ్డారు స్కీం వర్కర్ రా సమస్యలు పరిష్కరించే కనీస వేతనాలు 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలని గ్రామపంచాయతీ కార్మికులు అందర్నీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు 51 జీవోను సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి ప్రస్తుతం కొనసాగుతున్న కేటగిరీలను కొనసాగించాలని కోరారు మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ జీతాలు బిల్లులు చెల్లించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి కార్మిక పరిషత్తుల సమస్యలు పరిష్కరించాలని కోరారు ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ లో హమాలీలు గ్రామపంచాయతీ కార్మికులు మధ్యాహ్న భోజన కార్మికులు స్కీం వర్కర్లు అంగన్వాడి ఆశ వివిధ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బర్మా కొమురయ్య మండల మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల నరసింహులు జాలిగామ ప్రభాకర్ లస్కర్ రామచంద్రం మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి బైరెడ్డి లీలా రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ కాస రమేష్ కొమ్ము పద్మ కాసా నాగలక్ష్మి కొమ్ము లక్ష్మి పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి సైన్స్ సంబరాలు

నవతెలంగాణ- గజ్వేల్



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకు సైన్స్ సంబరాలు నిర్వహించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింలు తెలిపారు. శనివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ పాఠశాలలో ఈ పోటీలను నిర్వహించాలని తెలిపారు. 33 సంవత్సరాల నుంచి ఉమ్మడి రాష్ట్రంలోనూ అలాగే తెలంగాణ రాష్ట్రంలోనూ నిరంతరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సైన్స్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 12,000 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో 24 టీములు పాల్గొన్నారని ఆయన అన్నారు. ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు చెక్ ముక్ సైజు జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సైన్స్ పోటీలో గెలుపొందిన వారికి మండల విద్యాధికారి సునీత చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భవాని, జెవివి నాయకులు బాలరాజు. భాస్కర్, ప్రధానోపాధ్యాయులు శారద, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు శశిధర్ శర్మ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వలిహమ్మద్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ సత్యం, జిల్లా కోశాధికారి సాదత్వలి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజమౌళి, నర్సింగరావు, భాస్కర్ రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్, పర్యావరణ నిబంధనలు పాటించని సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్ క్వారీ సీజ్

- ఏడు రోజుల్లోనే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ విచారణ

నిబంధనలు పాటించని క్వారీలపై కఠిన చర్యలు

సంగారెడ్డి ఆర్డిఓ రవీందర్ రెడ్డి

నవ తెలంగాణ - పటాన్ చెరు



మైనింగ్, పర్యావరణ నిబంధనలు పాటించని మైనింగ్ లపై ప్రత్యేక టాస్క్ పోర్సు కమిటీ సీజ్ చేశారు. మండలంలోని లక్డారం గ్రామంలో మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వము లక్డారం క్రషర్ల భాగోతంపై ఫిర్యాదుల మేరకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ టాస్క్ ఫోర్స్ కమిటీని వేసి విచారణ చేపట్టారు.కమిటీ ఏర్పడిన ఏడు రోజుల్లోనే సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్ సప్లయర్ సంస్థ క్వారీనీ అధికారులు సీజ్ చేశారు.ఈ సంస్థ యాజమాన్యం మైనింగ్ నిబంధనలను నామమాత్రం కూడా పాటించడం లేదని కాలుష్య నియంత్రణ శాఖ నిబంధనలు ఉల్లంఘించారని క్వారీనీ సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఆర్డీవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ లక్డారం గ్రామ పరిధిలోని 37 క్రషర్ల యాజమాన్యాలు మైనింగ్ నిబంధనలను పాటించడం లేదని అన్నారు.టాస్క్ ఫోర్స్ కమిటీ పూర్తి నివేదిక రెండు రోజుల్లో రానుందని నివేదిక ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాజమాన్యాలు మైనింగ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏ.డి మధుకుమార్, కాలుష్య నియంత్రణ శాఖ ఈ.ఈ గీత,ఏ.ఈ శ్రవణ్,తాసిల్దార్ భాస్కర్,సీఐ ప్రవీణ్ రెడ్డి, ఆర్.ఐ కాజా పాల్గొన్నారు

ఎంపీ టికెట్ రేసులో కాంగ్రెస్ శ్రేణుల్లో పోటీ

పోటా పోటీగా ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ జహీరాబాద్



జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీలో పోటీ చేసేందుకు తీవ్ర పోటీ మేల్కొంది. తమ తమ అనుకూల మైనటువంటి నాయకులతో ఇప్పటికే టికెట్ సంపాదించేందుకు ప్రచారంతోపాటు నియోజకవర్గంలోని పరిధిలో పటం ఓటర్ల మండల పొందేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నార ఇప్పటికే జహీరాబాద్ మాజీ ఎంపీపీ నారాయణ రెడ్డి కుమారుడు ఎన్నారై డాక్టర్ ఉజ్వల రెడ్డి తమ వంతు ప్రయత్నం చేస్తూ అధిష్టానం నుండి టికెట్టు తమకే వస్తుందని హామీ లభించిందని పార్లమెంటు నియోజకవర్గం లోని వివిధ శాసనసభ కేంద్రాల్లో సైతం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లోని మండల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు ,వైద్య శిబిరాలు లాంటి అనేక కార్యక్రమాలు చేపడుతూ కార్యకర్తల్లో తమకంటూ స్థానాన్ని సంపాదించేందుకు కృషి చేస్తున్నారు. మాజీ ఎంపీ సురేష్ షట్కార్ తమకే పార్లమెంట్ టికెట్ లభిస్తుందని ధీమాలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో పర్యటనలు కానీ ప్రచారాలు కానీ ఎక్కడ కూడా నిర్వహించకపోవడం పట్ల కార్యకర్తల్లో అసహనం నెలకొంది చివరికి టికెట్ ఎవరికి లభిస్తుందో వేచి చూడాలి మరి.

గజ్వేల్ మహిళ డిగ్రీ కళాశాలలో పుస్తకాలు, బ్యాడ్జీల పంపిణీ

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం మధ్యాహ్నం "పిల్లల కోసం తొలిమెట్టు" కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ సేవా పథకం వాలంటీర్లకు సంబంధించిన పుస్తకాలు, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పివి ఉమా శశి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతి శనివారం పాఠశాలలకు వెళ్లి చదువులో వెనుకబడిన విద్యార్థులకు బోధన చేస్తున్నందుకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఉత్సాహంగా పాల్గొంటున్న కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీమతి బి కస్తూరిబాయ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి జయరాజులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య, పూజిత, నందిని, సుస్మిత, లేఖ , మానస, సంధ్యారాణి మొదలగు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై చిత్తశుద్ధి కరువు

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్

నవతెలంగాణ -నారాయణఖేడ్ రూరల్



పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన ఓటు ఆన్ అకౌంట్ బడ్జెట్ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని, అంకెల గారడీ తప్ప సంక్షేమం లేదని సిపిఎం నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు. కేంద్ర బడ్జెట్లో వెనుకబడిన నారాయణఖేడ్ లాంటి ప్రాంతాల అభివృద్ధి పట్ల ఎలాంటి ప్రస్తావన లేదు నిజాంపేట్ నుండి బీదర్ వరకు నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు, అకోలా నుండి నారాయణఖేడ్ మీదుగా బీదర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు కోసం గతంలోనే సర్వే చేసినప్పటికీ నిధులు కేటాయించకపోవడం మూలంగా హామీగానే మిగిలిపోతుంది వెనకబడిన ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు చేస్తామని గొప్పలు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం నారాయణఖేడ్ ప్రాంతంలో పరిశ్రమల అభివృద్ధి కోసం ఎందుకు చర్యలు చేపట్టడం లేదు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ అన్ అకౌంట్ బడ్జెట్ ఎన్నికల్లో ఓట్లు పొందడం కోసం తప్ప ప్రజల సంక్షేమం కోసం కాదని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ఉంది. పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర సరుకులు ధరలు తగ్గింపు ఊసే లేదని అన్నారు. సంపన్నులకు రాయితీలు ఇచ్చి పేదలు రైతులపై బారాల మోపి విధంగా బడ్జెట్ ఉంది. బడ్జెట్ ను సవరించి వెనుకబడిన నారాయణఖేడ్ లాంటి ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది.

ప్రేమ విఫలం.. యువకుడి ఆత్మహత్య

ఎర్రవల్లిలో సంఘటన

నవతెలంగాణ-మర్కుక్



ప్రేమ విఫలం కావడంతో యువకుడు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్న సంఘంటన మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో శనివారం చేటు చేసుకుంది. మర్కుక్ ఎస్ఐ డిం.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం ఎర్రవల్లి గ్రామానికి చెందిన గోదా కల్పన,చెవెళ్ల నరేష్ గత 6 నెలలుగా ప్రేమవ్యవహారం సాగింది.దీంతో అమ్మాయి గోల్ల సామాజికవర్గం,అబ్బాయి కుమ్మరి సామాజిక వర్గం కావడంతో అమ్మయి తల్లిదండ్రులు అడ్డు తెలిపి నరేష్ పై అమ్మాయి కుటుంబ సభ్యులు ,వరుసకు అన్న అయిన కరుణాకర్ పలు మార్లు దాడి దిగరన్నారు.దీంతో తను ప్రేమించిన అమ్మాయి తక్కదనే మనస్తాపానికి గురైన నరేష్ తన ప్రియురాలు కల్పనకు నీవు లేనిది నా జీవితం శూన్యమని శుక్రవారం సాయంత్రం పోన్ చేసి తను ఉరి వేసుకుంటున్నట్లు ప్రియురాలు కల్పనకు సమాచారం చేరవేసాడు.దీంతో ప్రియురాలు కల్పన, నరేష్ తల్లిదండ్రులు మీ కొడుకు ఇంట్లో ఉరి వేసుకున్నాడని సమాచారం అందజేసింది. అప్రమత్తమైన నరేష్ తల్లిదండ్రులు వెళ్లి ఇంట్లో చూసేసరి ప్యాన్ కు నరేష్ ఉరి వేసుకుని విఘత జీవిగా శవమై వేలాడడు.దీంతో తమను సాకే కొడుకు తమ కళ్ళ ముందే విఘత జీవిగా మారడం తో కుటుంబ సభ్యులు శోఖ సముద్రంలో మునిగి పోయారు.తమ కొడుకు ఉరి వేసుకొని చనిపోయే వాడు కాదని అమ్మాయి తల్లిదండ్రులు తమ కొడుకుని హత్యచేసి ఉంటారని వాపోయారు. ఈ మేరకు మర్కుక్ ఎస్ఐ డి.శంకర్ మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నమన్నారు.

సర్వేయర్ల పాత్ర కీలకం



టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్

నవతెలంగాణ-మెదక్

రైతుల పంట పొలాలకు సంబంధించిన వ్యవసాయ భూముల తగాదాల నివారణకు సర్వేయర్ల పాత్ర కీలకమని టిఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ కొనియాడారు. శనివారం టీఎన్జీవో భవన్‌లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ, రైతుల వ్యవసాయ భూములు ఆక్రమణకు గురికాకుండా సర్వే ద్వారా కాపాడి రైతులకు న్యాయం చేసే బాధ్యత భుజాన వేసుకున్నామన్నారు. విధి నిర్వహణతో పాటు ఉద్యోగులు టీఎన్జీవో సంఘ కార్యకలాపాలలో క్రియాశీలకంగా పాల్గొని, ఉద్యోగుల ఐక్యత చాటాలన్నారు, నూతన పెన్షన్ విధానం, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు, ఆదాయ పన్ను పరిమితి పెంపు తదితర సమస్యలపై సంఘటితంగా పోరాడి సమస్యలను సాధించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు.

జిల్లా అధ్యక్షులుగా యాదగిరిగౌడ్ ఎన్నిక

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా యాదగిరి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పి మొగులయ్య కోశాధికారిగా శ్రవణ్ రావు, ఉపాధ్యక్షులుగా శశి కుమార్, ఆర్.సంధ్య, సంయుక్త కార్యదర్శులుగా నర్సింగ్ రావు, బి అనురాధ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే. దుర్గా భవాని, ప్రచార కార్యదర్శిగా ఎం.శ్రీను, కార్యవర్గ సభ్యులుగా దత్త స్వరూప్, జి. ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎండి ఇక్బాల్ బాషా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ -గజ్వేల్

బాధిత కుటుంబానికి తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి ఆర్థిక సాయం అందించినట్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 19 వ వార్డు కౌన్సిలర్ గుంటుక శిరీష రాజు తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో పరిక మల్లవ ప్రమాదవస్తు బైక్ నుండి పడి మృతి చెందగా ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రతాప్ రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు వంగరి నాగరాజు, మెతుకు సాయిబాబా, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ వెంకటేష్ ఉన్నారు.

సీఐ సైదాను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- ప్రజ్ఞాపూర్



ఇటీవల గజ్వేల్ నూతన సీఐ గా బాధ్యతలు నిర్వహించారు. శనివారం గజ్వేల్ యువ నాయకుడు మాదాడి వినయ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వచ్చిన సీఐ మాట్లాడుతూ మేం పోలీసులుగా ప్రజలకు సేవ చేయడానికి ఉన్నామన్నారు. ప్రజలందరూ సహకారం ఉండాలని సోదరుభవంతో ఉండే విధంగా కృషి చేయాలని సూచించారు.

పర్సు పోడగొట్టుకున్న ప్రయాణికురాలికి అప్పగింత



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

జేబీఎస్ నుండి ప్రజ్ఞాపూర్ వస్తున్న సమయంలో ప్రయాణికురాలు బస్సులో మర్చిపోకూడదు శనివారం ప్రయాణికురాలు ప్రజ్ఞాపూర్ బస్టాండ్ లో తమ పర్సు పోగొట్టుకున్నది. ఆ పర్సు ప్రజ్ఞాపూర్ లో ఆర్టీసీ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన కంట్రోలర్ ఆర్ ప్రతాపరెడ్డి గారికి దొరికింది. అందులో ఉన్నటువంటి డబ్బులు రూ. 2300, అందులో ఉన్న మెడికల్ రసీదును చూసి డాక్టర్ గారికి ఫోన్ చేసి విషయం తెలిపారు. బాధితురాలి అమౌంటు, పర్సు ను, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిఎం సురేఖ చేతుల మీదుగా బాధితురాలు గ్రామం మక్కరాజుపేట్ కి ఇవ్వడం జరిగిందన్నారు.వారి శ్రమకు గ్రామస్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం కొండం రాజు పల్లి గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పబ్బతి ప్రియాంక రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ నారోజు విజయ లక్ష్మి-బ్రహ్మచారి ఐదు సంవత్సరాలుగా గ్రామానికి సుదీర్ఘ పాలన అందించారని తెలిపారు గ్రామ పంచాయితీ సిబ్బందికి వార్డు సభ్యులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. శాలువాలు కప్పి వారిని సన్మానించి సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రియాంక రాజిరెడ్డి, గ్రామ నాయకులు బండి తిరుపతి యాదవ్, మ్యాక కనకయ్య బాగు తిరుపతి, తడకపల్లి శ్రీనివాస్, సిలువని శ్రీనివాస్ తగిరెడ్డి వెంకటరెడ్డి, మల్లేశం, యువ నాయకుడు బాగు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.



సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి

అదనపు సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిహార దీక్షను సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపల్‌లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. ఉద్యోగాల పేరు మీద లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. పేరుకే జిల్లా కేంద్రం తప్ప కార్మికులకు మాత్రం వేతనాలు ఇవ్వడం లేదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబును సస్పెండ్ చేయకపోతే విధులు బహిష్కరించి పెద్దఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకురాలు సువర్ణ, రాజు, జనార్దన్, సంగమేశ్వర్, యాదగిరి, నర్సింలు, సంగీత, సుజాత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గడ్డపోతారం స్పెషల్ ఆఫీసర్‌గా సంతోష్ కుమార్



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని పారిశ్రామిక పంచాయతీ ప్రాంతమైన గడ్డపోతారం స్పెషల్ ఆఫీసర్‌గా జిన్నారం మండల పంచాయతీ ఆఫీసర్ సంతోష్ కుమార్ చార్జ్ తీసుకున్నారు. ఈ మేరకు సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి, మాజీ సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, ఎంపీటీసీ జానాబాయి, సెక్రటరీ వెంకట్, శ్రీనివాస్, రామకృష్ణ పలువురు పంచాయతీ ప్రతినిధులు, సిబ్బంది, గ్రామస్తులు, యువకులు సంతోష్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

'పల్లెకి పోదాం పదండి' వర్క్‌షాప్

నవతెలంగాణ-జిన్నారం

'పల్లెకి పోదాం పదండి' కార్యక్రమంలో భాగంగా జిన్నారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు వంగేటి రాజిరెడ్డి నేతృత్వంలో శనివారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రతాపరెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోమడుగు రమేష్, మధుసూదన్ రెడ్డి, శంకర్, రాజు, జగన్ రెడ్డి, కృష్ణ ,కె లక్ష్మణ్ వెంకటేష్, పద్మారావు, నరసింహారెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల్లో బ్లీచింగ్ పౌడర్..

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని వివిధ వార్డులో ఉన్న తాగునీటి సరఫరా చేసే కుళాయిలన్నింటిని బ్లీచింగ్ పౌడర్‌తో పారిశుధ్యం చేస్తున్నట్టు మున్సిపల్ కమి షనర్ సుభాష్‌రావు తెలిపారు. తాగు నీటి కుళాయిలతో పాటు పైప్‌లైన్‌లో ఎక్కడైనా లీకేజీలో మరమ్మతులు ఉం టే వాటిని కూడా తక్షణమే చేస్తామన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా వివిధ రకాల వ్యాధులు ప్రభలే ఆస్కారం ఉన్నదని.. అందుకే ముందస్తుగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో నీటి కుళాయిల్లో పారిశుధ్య పనులు చేపట్టినట్టు చెప్పారు.

క్యాన్సర్ నిర్మూలనపై ప్రదర్శన



నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాన్సర్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సఫియా సుల్తానా, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

ముర్తుజాపూర్‌లో పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని ముర్తుజాపూర్ గ్రామంలో ఐదేండ్లు పాలన చేపట్టిన సర్పంచ్, పాలక వర్గాన్ని గ్రామస్తులు శనివారం సన్మానించారు. ఈ మాజీ సర్పంచ్ మాజిత్‌పటేల్ మాట్లాడుతూ.. ముర్తుజాపూర్ గ్రామ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు, వార్డ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, వార్డ్ సభ్యులు, గ్రామ యువకులు సాల్మన్, ప్రశాంత్, రంశెట్టి, జాక్కి, మోహన్, దినకర్, పంచాయతీ సిబ్బంది, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనలో జేవీవీ కీలక పాత్ర



నవతెలంగాణ-సంగారెడ్డి

మూఢ నమ్మకాల నిర్మూలనలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) కీలక పాత్ర వహిస్తున్నదని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డి జిల్లాలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఈ టెస్ట్‌కు జిల్లా నలుమూలల నుంచి 102 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా విజేతలకు సర్టిఫికేట్లు, మేమెంటోలు అందజేశారు. జిల్లా నుంచి 12 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. సమాజంలో మూఢ విశ్వాసాల నిర్మూలనకు జన విజ్ఞాన వేదిక కీలకంగా కృషి చేస్తున్నదన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుట కోసం చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తున్న జన విజ్ఞాన వేదిక సంగారెడ్డి జిల్లా నాయకులకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకులు సత్యం సైన్స్ మేజిక్ షో విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. నీటితో మంటలు, నలుకకు శూలాలు గుచ్చుకోవడం, మోచేతుల నుండి మొలలు తీయడం లాంటి వాటిని స్వయంగా చేసి చూపించి ఈ మేజిక్ ట్రిక్స్ వెనుక దాగి ఉన్న సైన్స్‌ను, హస్త లాఘవాన్ని విద్యార్థులకు వివరించి వారిని చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రతాప్,జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్ పాల్, జేవీవీ సీనియర్ నాయకులు సోమ శేఖర్ వైస్ ప్రెసిడెంట్ బాలయ్య, కోశాధికారి ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు శశిధర్, జగన్ మోహన్, మహేష్, అశోక్, రామ చంద్రయ్య, సాయి తేజ, మొగులయ్య, లతీఫ్, రవీందర్, ప్రవీణ్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తపాలా శాఖ సేవలు

నవతెలంగాణ-కల్హేర్



ఇంటింటికి తపాలా శాఖ సేవలు అందించడానికి అన్ని గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ త్రిపాటి తెలిపారు. నిజాంపేట్ మండల పరిధిలోని రామ్‌రెడ్డిపేట గ్రామంలో ఖాతాదారులకు లాభాదాయకమైన పోస్టల్ పథకాలపై శనివారం ఇంటింటికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ధీమాగా ఉండాల న్నారు. తపాలా శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలను ప్రతీ ఒక్కరు తప్పని సరిగా ఉపయోగించుకో వాలన్నారు. ఈప్రాంతంలో తపాల శాఖ జీవిత బీమా పాలసీలను పెంచేందుకు, పొదు పు పథకాలు ఇంటింటికి చేరేలా బీపీఎంలు, తపాలా శాఖ సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. పొదుపు గురించి జీవిత బీమా పాలసీల వివరాలను అందరికీ తెలియజేసి వారికి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. తపాల శాఖలో సేవింగ్ రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి అకౌంట్, టర్మ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఏక్సిడెంట్ గార్డ్ తదితరుల మంచి మంచి పొదుపు పథకాలు ఉన్నాయని వివరించారు. ఈ మేరకు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏంవో శ్రీనివాస్, బిపిఎంలు శ్వేత, ఏబిపి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలో ఉద్యోగాలకు రాజబాట 'గేట్'



నవతెలంగాణ-పటాన్‌చెరు

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) అనేది ప్రతిష్టాత్మక సంస్థలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదవడానికి మార్గం మాత్రమే కాదు, ఇది ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), పరిశోధనా కేంద్రాలు, ఇతర సాంకేతిక విభాగాలలో విస్తృత శ్రేణి ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తుందని హై దరాబాద్ లోని ఏస్ (ఏసీఈ) ఇంజనీరింగ్ అకాడమీ అధ్యాపకుడు ఎం.ఎం. త్రినాథ్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని, కెరీర్ గైడెన్స్ కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ రంగ సంస్థలలో ఉపాధి అవకాశాలు' అనే అంశంపై శనివారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఇంజనీరింగ్ పట్టభద్రుల భవిష్యత్తును రూపొందించడంలో గేట్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.గేట్ నుంచి మార్కులను సాధించడం ద్వారా భారతదేశంలోని ఐఐఎస్‌సీ, ఐఐటీలు, ట్రిబుల్ ఐటీలు, ఎన్ఐటీల వంటి ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థలలో మాస్టర్స్ (పీజీ)ని అభ్యసించడమే గాక, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగం పొందడానికి ఉపకరిస్తుందన్నారు. మనదేశంలోని ప్రధాన సీఎస్‌యూలలో తాజా ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఇక్కడ ప్రాథమిక అర్హత కోసం గేట్ తప్పనిసరి పరీక్షగా పనిచేస్తుందని చెప్పారు. దీనికి అదనంగా, భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో), భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో), బాబా అణు పరిశోధనా కేంద్రం (బార్క్) వంటి నాన్-పీఎస్యూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా గేట్ స్కోర్లు: ఆధారంగా అభ్యర్థులను నియమించుకుంటాయని త్రినాథ్ నివరించారు. అంతేకాక, గేట్ అర్హత కలిగిన విద్యార్థులకు సగటున రూ.12,400 నుంచి 28,000 వరకు ఉపకార వేతనాన్ని పలు ప్రభుత్వ రంగ సంస్థలు అందజేస్తాయన్నారు.ఔత్సాహిక ఇంజనీర్లు తను మాస్టర్స్ డిగ్రీని భారతదేశంలో లేదా విదేశాల్లోని అత్యుత్తమ విద్యా సంస్థలలో అభ్యసించాలని త్రినాథ్ సూచించారు. గేట్-అర్హత కలిగిన విద్యార్థులు కేవలం ఒక లక్ష (స్టయిఫండ్ తీసివేసిన తరువాత) ఖర్చు చేయడం ద్వారా మన దేశంలోని అత్యున్నత విద్యా సంస్థలలో మాస్టర్స్ డిగ్రీని అభ్యసించవచ్చని, విదేశాలలో వచ్చే వేతనానికి సమానమైన మొత్తాన్ని మనదేశంలోనే పొందవచ్చని చెప్పారు. అటువంటప్పుడు విదేశీ మాస్టర్స్ కోసం 40 నుంచి 50 లక్షలు ఖర్చుచేసి అదే నేతనాన్ని పొందడం వల్ల ఒనగూనే అదనపు ప్రయోజనం ఏమిటో ప్రతిఒక్కరూ ఆలోచించాలన్నారు. నీస్ ఇంజనీరింగ్ అకాడమీ అందించే సేవలు, శిక్షణ, స్వల్ప వ్యవధి సర్టిఫికేట్ కోర్సులను త్రినాథ్ వివరించడమే గాక, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ప్రజలు సహకారంతోనే సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-న్యాల్‌కల్



గ్రామాల్లో మెరుగైన పాలనకు, సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రత్యేక అధికారులకు సహకరించాలని తహసీల్దార్ భాను కిరణ్ విజ్ఞప్తి చేశారు. కాగా టేకుర్, మిరాజ్‌పూర్(ఏన్), ముంగి గ్రామల ప్రత్యేక అధికారు లు శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. అందరి సమన్వయంతో పనులు చేసుకోవాలని పంచాయతీ సెక్రెటరీలకు చెప్పారు. ప్రత్యేక అధికారికి చార్జ్ తీసుకోవడంతో భాను కిరణ్‌ను మాజీ సర్పంచులు శాలువాతో సన్మానించారు. వారిలో మాజీ సర్పంచ్లు అమీర్, మల్ రెడ్డి, గ్రామస్తులు సంతోష్, సెక్రెటరీలు ఇంద్రజ, జ్యోతిర్మయి ఉన్నారు.



పదవికి మాత్రమే విరమణ.. ప్రజాసేవకు కాదు

నవతెలంగాణ-కల్హేర్

ఐదేండ్ల కాలం నిజాంపేట్ ప్రజానీకానికి సర్పంచ్‌గా ఇతోధికంగా సేవచేసి పదవీ కాలం ముగియడంతో బాధ్యతల నుంచి తప్పుకుంటున్నాని.. అయితే విరమణ అనేది పదవికి మాత్రమేనని.. ప్రజాసేవకు కాదు అని సర్పంచ్ జగదీశ్వర్ చారీ అన్నారు. నిజాంపేట పంచాయతీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడుతూ.. తన మీద నమ్మకంతో గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవకు భాగ్యం కల్పించిన గ్రామస్తులకు, పరిపాలనా సౌలభ్యం కోసం తోడ్పాటును అందించిన పాలకవర్గ వార్డు సభ్యులకు పార్టీలకతీతంగా సహకరించిన గ్రామ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గడిచిన ఈ ఐదేండ్లు కాలంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితు ల్లోనూ, అభివృద్ధి పనులు తీర్మానాల్లో, అనుకూల, ప్రతికూల సమయాల్లో తనకు వెన్నుదన్నుగా ఉండి తోడ్పాటు అందించిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. మన ఊరు మనబడి పథకం కింద నూతన తరగతి గదులు, స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ, వంటశాల గది, మూత్రశాలను, సొంపు నిర్మించుకున్నామన్నారు. ఇలాంటి ఎన్నో అభివృద్ధి పనులను పట్టుబట్టి చేయించుకున్నామన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ సాయిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు సర్పంచ్ కమ్మరి జగదీశ్వర చారీ, ఉప సర్పంచ్ రాజబాయిలను ఘనంగా సన్మానించారు. తర్వాత గ్రామ సర్పంచ్ 14 మంది వార్డ్ సభ్యులను సన్మానిస్తూ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గావ్ ఛలో అభియాన్ విజయవంతం చేయండి

నవతెలంగాణ-సంగారెడ్డి

బీజేపీ కేంద్ర పార్టీ చేపట్టిన గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం సంగారెడ్డి పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు ప్రసాది రవిశంకర్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు పులిమామిడి రాజు హాజరై మాట్లాడారు. గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి చేరేలా, ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం పతకాలు మోడీ చేస్తున్న అభివృధి తెలిసేలా చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తలపై ఎంతైనా ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమాన్ని అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. ఈ వర్క్ షాప్ లో రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు యశ్వంత్ ,సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్స్ మందుల నాగరాజు, కసినివాసు, మురళీధర్ రెడ్డి, విజయ్ కుమార్,లక్ష్మి ,ఈశ్వ రి, స్వర్ణలత,సంతోషి,మీన గౌడ్‌తదితరులు పాల్గొన్నారు.